బాల ఉగాది.. భళా!





ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మల్లాపూర్/బోడుప్పల్: పలు పాఠశాలల్లో బాలలు ఉగాది సంబరాలు జరుపుకున్నారు. క్రోధి నామ ఉగాది వేడుకల్లో ఉత్సాహంగా, ఉల్లాసంగా సందడి చేశారు. నాచారం డక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్లో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సంప్రదాయ వేషధారణలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ సుమ మీనన్, డక్కన్ స్ప్రింగ్ పాఠశాల చీఫ్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పవన్, సాంబ, కోర్ హెడ్ కిషోర్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో....

తెలుగు సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కొత్త సంవత్సరంలో విద్యార్థులు కొంగొత్త ఆలోచనలతో ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కార భారతి ఆధ్వర్యంలో....

గౌతంనగర్: మల్కాజిగిరి సంస్కార భారతి, సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉగాది సంబరాలు నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్షులు బీఆర్ కృష్ణ, వేణుగోపాల్ ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్కార్ భారతి కేంద్ర కమిటీ మార్గదర్శకులు నిరంజన్ హాజరయ్యారు. అనంతరం సమ్మోహన్ ఆర్ట్స్ అకాడమీ వారి శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సంస్కార భారతి వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.సంస్కార భారతి రాష్ట్ర నాట్య విభాగ అధ్యక్షురాలు కిరణ్మయి, మీడియా ఇన్‌చార్జ్ వెంకట్ కిషోర్ పాల్గొన్నారు.

నేడు ఉగాది ఉత్సవాలు

రామంతాపూర్: ఆర్టీసీ కాలనీలోని యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాలకు సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త కపర్తీశ్వర్‌రావు, వర్కాల కృష్ణాజీ హాజరవుతారని పేర్కొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న గోపాల్‌రెడ్డి



సంస్కార భారతి వార్షిక కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఒక్క అవకాశం ఇవ్వండి: సునీత



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సునీతామహేందర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ కాలభైరవ దేవాలయంలో మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్ రెడ్డి, ఉప్పల్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంటీ ఆఫీస్ కాలనీవాసులు

అల్వాల్: హెచ్‌ఎంటీ ఆఫీస్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీవాసులు అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కుకు ఫెన్సింగ్ ఏర్పాటు వేయాలని, గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టాలని, పోకిరీల ఆగడాలను అడ్డుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, స్వామి, నారాయణ, తిరుపతిరెడ్డి, ప్రమోద్‌బాబు, కేశవ్, బుచ్చిరెడ్డి, బ్రహ్మం, నరేష్, ఎలామాస్‌రెడ్డి, మహదేవగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సబర్బన్ ట్రైన్ ట్రావెలర్స్ సంబరాలు



మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో సంబరాల దృశ్యం

గౌతంనగర్: సబర్బన్ ట్రైన్ ట్రావెలర్స్ సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఎంఎంటీఎస్ రెండవ దశలో భాగంగా మేడ్చల్–సికింద్రాబాద్ మార్గంలో ఎంఎంటీఎస్ రైళ్లు ప్రారంభించి ఏడాది పూర్తి అయింది. ఈ సందర్భంగా సబర్బన్ ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్‌కు పూలమాల వేసి లోకోపైలట్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవీ స్వామి, శంకర్‌రావు, రవిశంకర్‌సింగ్, మురళీకృష్ణ, ప్రసన్న, నాని తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

ప్రొఫెసర్ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

బోడుప్పల్: న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు మూల స్తంభాలుగా ఉన్న భారత రాజ్యాంగం మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం కాకుండా పరిరక్షించుకుందామని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ రక్షణ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం బోడుప్పల్ బొమ్మక్ బాలయ్య ఫంక్షన్‌హాల్‌లో 'రాజ్యాంగ రక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మన రాజ్యాంగం అధికారులు, పాలకుల పరిమితులను తెలియజేస్తుందని, ఇష్టారాజ్యంగా కాకుండా పరిమితులకు లోబడి చట్టాలు చేయాలన్నారు. సమాజంలో అసమానతలు తొలగిపోవాలని, అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని పేర్కొన్నారు. జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ రాజ్యాంగ వ్యతిరేక ప్రభుత్వం వస్తే తిరగబడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ ఓబీసీ అని చెప్పుకుంటారేగానీ, ఓబీసీ కులగణన మాత్రం చేయరని, వారికి రిజర్వేషన్లు కల్పించరని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, బొమ్మక్ రమేష్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో దివంగత జర్నలిస్టు నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం ముచుకుంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరై మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, శ్రీశైలం, జీవన్‌రెడ్డి, వెంకటేశ్, గణేశ్, గోపాల్‌రెడ్డి, ముచుకుంద, ప్రియాంక, శివ, రమేశ్‌ముదిరాజ్, నరసింహాచారి, శంకర్ స్థానికులు పాల్గొన్నారు.

నీటి సమస్యలపై ఫిర్యాదు చేయండి

మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ



ఘట్‌కేసర్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు హెల్ప్‌లైన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రస్తుతం నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందని, నీటి వృథాను అరికట్టాలన్నారు. నీటి సరఫరాపై అంతరాయం ఏర్పడితే టోల్ ఫ్రీ నంబర్ 18004257578 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'కాంగ్రెస్‌ను పథకాలే గెలిపిస్తాయి'



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ రామకృష్ణకాలనీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వివరిస్తూ మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపడితేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు సునీతా మహేందర్‌రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య అన్నదానాలు

కుషాయిగూడ: అమావాస్యను పురస్కరించుకొని సోమవారం కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద మారుతీ మిత్రమండలి, ఈసీఐఎల్ చౌరస్తాలో వాసవి మిత్రమండలి వారు అన్నదానం చేశారు. ప్రతి అమావాస్యరోజు విధిగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో మారుతీ మిత్రమండలి అధ్యక్షుడు అశోక్‌చారి, ప్రధాన కార్యదర్శి హనుమంతు, మచ్చ బాబు, వేణుగోపాల్, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాసుల సురేశ్‌గౌడ్, వెంకటేశ్‌చారి, శ్రీకాంత్‌గౌడ్, వాసవి మిత్రమండలి ప్రతినిధులు పెద్ది నాగరాజు గుప్తా, తిరుమలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కుషాయిగూడలో అన్నదానం చేసిన మారుతీ మిత్రమండలి ప్రతినిధులు



ఈసీఐఎల్ చౌరస్తాలో అన్నదానం చేసిన వాసవి మిత్రమండలి ప్రతినిధులు

తాగునీటి సమస్యలను పరిష్కరించాలని వినతి

ఘట్‌కేసర్: కాచవాని సింగారం మహేశ్వరీ నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు సోమవారం ఎంపీడీఓ గీతకు వినతి అందజేశారు. మహేశ్వరీనగర్‌లో నీటి సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారుల ఆదేశాలు బుట్టదాఖలు చేశారని లేఖలో తెలిపారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీరు ఇంటింటికీ సరఫరా అయ్యేందుకు నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు జయచంద్ర, మండల కార్యదర్శి ఈశ్వర్, సోమన్న, అబ్దుల్లా, ఖదీర్ పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యం



ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న సాయికిరణ్



తల్లిదండ్రులతో సాయికిరణ్

మల్లాపూర్: పేదలకు మంచి వైద్యం అందించడమే తన లక్ష్యమని ఎంబీబీఎస్ పట్టా అందుకున్న సాయికిరణ్ అన్నారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి వైద్యుడిగా తిరిగి స్వదేశానికి వస్తానని పేర్కొన్నారు. మల్లాపూర్ నాగ లక్ష్మీనగర్ కాలనీకి చెందిన వస్పరి శ్రీనివాస్–కృష్ణవేణి దంపతుల పెద్ద కుమారుడు సాయికిరణ్ 2018లో నీట్‌లో ర్యాంకు సాధించి సిద్దిపేట మెడికల్ కాలేజీలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించాడు. మొక్కవోని దీక్ష, పట్టుదలతో చదివి తాజాగా ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. కేసీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్రాడ్యుయేషన్ సెర్మనీలో మెడికల్ కాలేజీ హెచ్ఓడీ డాక్టర్ మాధవ్ చేతుల మీదుగా సాయికిరణ్‌కు పట్టా అందుకున్నారు.

ఈపీఎల్ టోర్నీ ప్రారంభం



ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో ఎదులాబాద్ ప్రీమియం లీగ్(ఈపీఎల్) గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ రవితో కలిసి టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీయడానికి టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌రెడ్డి, నరేందర్‌ముదిరాజ్, మాజీ ఎంటీసీ రవి, మహేశ్‌ముదిరాజ్, శ్రీనివాస్, శేఖర్, యుగేందర్‌గౌడ్, అమర్ పాల్గొన్నారు.

తెలుగులో కాలచక్ర

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ప్రైవేటు వినోద చానెల్ జీ టీవీ ఆధ్వర్యంలోని జీ థియేటర్ సమర్పిస్తున్న మరాఠీ టెలిప్లే కాలచక్ర తెలుగులో అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ కాలచక్రలో ప్రముఖ నటి గుల్కీ జోషి (ఫిర్ సుబహ్ హోగీ, మేడమ్ సర్..ఫేం) నటిస్తున్నారని, అత్తమామలపై క్రూరత్వాన్ని ప్రదర్శించే కోడలిగా ఆమె తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇషాన్ త్రివేది చిత్రీకరించిన కాలచక్రలో ఏప్రిల్ 14న ఎయిర్టెల్ స్పాట్‌లైట్, డిష్ టీవీ రంగ్‌మంచ్ యాక్టివ్, డి2హెచ్ రంగ్‌మంచ్ యాక్టివ్‌లో చూడొచ్చన్నారు.

సెంట్రింగ్ మేస్త్రీ ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ సెంట్రింగ్ మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ కామాక్షిపురం ప్రాంతానికి చెందిన బీగుల సత్యనారాయణ(45) వృత్తిరీత్యా సెంట్రింగ్ మేస్త్రీ. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో సోమవారం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

అల్వాల్: గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేసి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ ఏసీపీ కె.రాములు సోమవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. అల్వాల్‌కు చెందిన వరికుప్పల జంపన్న (20), పాలమూని గౌతమ్(19) స్నేహితులు. వీరు గతంలో సికింద్రాబాద్ మహంకాళీ, మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారు. కాగా, ఈ నెల 6న సూర్యనగర్‌కు చెందిన ఎ.సురేందర్‌రెడ్డి రాత్రి 12 గంటల సమయంలో తన ఇంటి బయట సిగరెట్ తాగుతుండగా వెనుక నుంచి వచ్చిన ఇద్దరు ఆగంతకులు అతడిని కొట్టి మెడలోంచి బంగారు గొలుసు, మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. బాధితుడు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 7న అల్వాల్‌లో అనుమానాస్పదంగా కనిపించిన జంపన్న, గౌతమ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాన్ని అంగీకరించారు. వీరి నుంచి తులం బంగారు గొలుసు, మొబైల్ ఫోన్, యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర వహించిన సీఐలు రాహుల్‌దేవ్, రాజేందర్‌గౌడ్, క్రైమ్ సిబ్బంది విద్యాకర్‌రావు, గౌస్ పాషా, రమాకాంత్, సుధాకర్‌లను ఏసీపీ రాములు అభినందించారు.

గృహిణి ఆత్మహత్య

అల్వాల్: ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానాజీగూడ గ్రీన్‌హిల్స్ కాలనీలో నివసించే సాయికుమార్‌తో కవాడిగూడ వాసి అనూష(29)కు 2017లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కాగా, సోమవారం అనూష ఇంట్లోని బాత్‌రూమ్‌లో ప్లాస్టిలుతాడుతో నీటి కుళాయికి ఉరేసుకొంది. అనూష తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పిల్లలకు జ్వరంగా ఉన్నా మందులు తీసుకురాలేదని భర్త మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు.

మల్లాపూర్‌లో ఇఫ్తార్ విందు



మల్లాపూర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీలో ఎండీ అల్తాఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకంగా నిలుస్తాయన్నా రు. అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను ఘనంగా సత్కారించారు.

తాగునీటి సరఫరాపై 14420 టోల్ ఫ్రీ నంబర్

బోడుప్పల్: వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాపై టోల్ ఫ్రీ నంబర్ 14420 ఏర్పాటు చేసినట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం వెల్లడించారు. బోడుప్పల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్‌ల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల అభివృద్ధి పనుల కారణంగా అక్కడక్కడ మంచినీటి పైపులైన్లు పగలడం, లీకేజీల కారణంగా నీటి సరఫరాలో జాప్యం ఏర్పడుతోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 14420 లేదా పౌర సేవా కేంద్రం నంబర్ 040– 27215959 ఉపయోగించుకోవాలన్నారు.